సాక్షి
ప్రకాశం

బుధవారం । 15 । మార్చి । 2023



ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు
ఇంటర్మీడియెట్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా భద్రత ఏర్పాట్లు చేశారు.
- 8లో..



వెంటాడిన మృత్యువు
చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం పాలకూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పామూరు మండలం తాతయ్యపల్లి గ్రామానికి చెందిన మహిళ మృతి చెందింది.
- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
33 /21

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు రూ.25 లక్షల సీఎం నిధులు



చెక్కు అందచేస్తున్న మంత్రి ఆదిమూలపు

యర్రగొండపాలెం: లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం అయ్యే వైద్య ఖర్చులు రూ.25 లక్షలు సీఎం సహాయ నిధి నుంచి మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ బాధిత కుటుంబానికి విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఎల్‌ఓసీ చెక్కును అందచేశారు. మండలంలోని వై.కొత్తపల్లికి చెందిన అంబటి మల్లీశ్వరి లివర్ సమస్యతో బాధపడుతోంది. ఆమె లివర్‌ను ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని, అందుకు రూ.లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. అంత ఖర్చు భరాయించి తన భార్యను కాపాడుకోలేనన్న బాధతో ఆమె భర్త రామిరెడ్డి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చినఓబులరెడ్డిని కలిశాడు. ఈ విషయాన్ని వారి ద్వారా తెలుసుకున్న మంత్రి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు మంజూరు చేయించారు. పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించిన వారికి రామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్‌ఎంలు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలి

ఒంగోలు: ఏప్రిల్ నెలలో నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో పి.రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని , దానిపై కౌంటర్ సంతకం చేసి విద్యార్థులకు అందించాలి. విద్యార్థుల ఫొటోలు మిస్ అయితే ఖచ్చితమైన ఫొటోను హాల్‌టికెట్‌కు జతచేసి విద్యార్థులకు అందించాలి.

నేటి నుంచి ఎడ్ల బండలాగుడు పోటీలు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండలో నిర్వహించే శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నేటి నుంచి రెండు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల స్థాయి ఎడ్ల బండలాగుడు బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు వెలుగొండ దేవస్థానం చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి తెలిపారు. పోటీలు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే కేపీ.కొండారెడ్డి, ఎమ్మెల్యే కేపీ.నాగార్జునరెడ్డి సారథ్యంలో చైర్మన్ తిరుపతిరెడ్డి, మేకలవారిపల్లి రెడ్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. బుధవారం 2, 6 పండ్ల సైజు విభాగంలో ఎడ్ల బండలాగుడు పోటీలు ప్రారంభమవుతాయి.

మేటి మృగం
జీవన వైవిధ్యం

పులి.. ఈ పేరు వింటేనే అందరికీ హడల్. ఇది వన్యమృగం.. అయినా సౌమ్యం వీటి సొంతం. అయితే నల్లమల పులి జీవనం వైవిధ్యం. పులులు సంఘజీవులు కావు. ఒంటరిగా బతికేందుకు ఇష్టపడతాయి. ఇతర జంతువులతో కలవడం చాలా అరుదు. ఇవి ఆహారం కోసం వన్యప్రాణులను వేటాడడం.. పిల్లల్ని కనడం.. వాటికి జీవన మెళకువలు నేర్పడం.. ఆ తర్వాత అరణ్యంలో బతికేందుకు వదిలేయడం అంతా విభిన్నంగా ఉంటుంది. సువిశాల విస్తీర్ణంలో నెలకొన్న ఎన్ఎస్‌టీఆర్ (నాగార్జున సాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వు ఫారెస్ట్)లో ఉంటే పులులతో పాటు ఇతర టైగర్ ఫారెస్ట్‌ల్లో ఉండే వాటికంటే చాలా సౌమ్యంగా ఉంటాయి. బఫర్ ఏరియాలను దాటి జనారణ్యంలోకి తరుచూ వచ్చినా మనుషులపై దాడులు చేసిన ఘటనలు అరుదు. ఇక్కడ ఉండే పులులు సాధువుగా ఉంటాయని అంటున్నారు వన్యప్రాణుల పరిశోధకులు.

- సాక్షి, ఒంగోలు డెస్క్



నల్లమలలో నాగులూటి బీటు వద్ద..

- జనారణ్యంలోకి వచ్చినా సౌమ్యత
- నల్లమలలో 75కి పైగా పులులు
- ఇవి మనుషులపై దాడులు చేయడం చాలా అరుదు
- 600 మంది సిబ్బందితో పులులపై అటవీ శాఖ నిరంతర నిఘా
- ప్రారంభమైన పులుల గణన
- వేసవిలో నీటి కోసం 120 సాసర్ పిట్ల ఏర్పాటు

జీవ వైవిధ్యానికి నెలవుగా ఉండే నల్లమల అభయారణ్యం 3,700 చదరపు కిలో మీటర్ల మేర ఎన్ఎస్‌టీఆర్ విస్తరించి ఉంది. దేశంలోనే అతి పెద్ద టైగర్ రిజర్వు ఫారెస్ట్ ఇది. దీని చుట్టూ వందలాది గిరిజన గూడేలు ఉన్నాయి. ఇక్కడ నివశించే పులి నల్లమల రాజుగా పేరొందింది. అంతరించిపోతున్న వీటి సంరక్షణకు, వీటి సంతతిని పెంచేందుకు అటవీశాఖ అధికారులు ఎన్నో రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అధికారికంగా 75 పులులు ఉన్నాయని గుర్తించినా అనధికారికంగా 100కు పైగా ఉన్నాయని అంచనా. ఈ ఏడాది కూడా పులుల గణన ప్రారంభమైంది. ఏప్రిల్ నెల చివరి వరకూ వివిధ దశల్లో వీటిని లెక్కింపు చేస్తారు.

మృగమే కానీ..

సాధారణంగా అటవీ ప్రాంతానికి సమీప గిరిజన గూడేలకు మధ్య బఫర్ ఏరియా ఉంటుంది. వన్యప్రాణులు, మృగాలు జనావాసాల వైపు రాకుండా ఉండేలా ఒక అంచనా వేస్తూ బఫర్ ఏరియాలను నిర్ణయించారు. అయితే మనుగడ కోసం గిరిజన ప్రాంతాల్లోని వారు బఫర్ ఏరియాలను దాటి ముందుకు వచ్చేశారు. దీంతో తరుచూ వన్యప్రాణులు జనారణ్యంలోకి వస్తున్నాయి. నల్లమల రాజుగా పేరొందిన పులులు ఇతర టైగర్ ఫారెస్టుల్లో ఉన్న పులులు కంటే చాలా సాధుగుణం కలిగి ఉంటాయి. తెలంగాణ, మహారాష్ట్ర బోర్డర్‌లో ఉన్న తడోబా టైగర్ ఫారెస్టులోని పులులు నిత్యం మనుషులపై దాడులు చేస్తుంటాయి. నెలకు ఒకరిద్దరిని పొట్టన పెట్టుకుంటుంటాయి. ఇలా ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే ఎన్ఎస్‌టీఆర్‌లో మాత్రం పులులు తరుచూ జనారణ్యంలోకి వచ్చినా మనుషలపై దాడులు చేయడం చాలా అరుదు. మిగతా ప్రాంతాలతో పోల్చుకుంటే 0.001 శాతం మాత్రమే దాడి చేసి ఉంటాయని వన్యప్రాణి నిపుణులు అంటున్నారు. ఎన్ఎస్‌టీఆర్‌లో ఒక పులి సంచరించేందుకు 30 నుంచి 40 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణం ఉంటుంది. ఇతర వన్యప్రాణులను వేటాడుతూ.. లేదా నీళ్ల కోసం బఫర్ ఏరియాలను దాటి గూడేల వైపు ఇవి వస్తుంటాయి. గత నెలలో గిద్దలూరు అటవీ డివిజన్ పరిధి మాగుటూరు, లక్ష్మీపురం, వెలగలపాయ, శంకరాపురం, కాకర్ల తదితర గ్రామాల పరిధిలోనూ, మార్కాపురం అటవీ డివిజన్ పరిధిలోని యర్రగొండపాలెం మండలం కొలుకుల గ్రామం పరిధిలో పులి సంచరించినట్లు అధికారులు గుర్తించారు. వీటి దాడిలో ఎద్దులు సైతం మృతి చెందాయి. పులుల సంచారాన్ని గుర్తించేందుకు అధికారులు ట్రాప్ కెమెరాలు అమర్చారు. పెద్దపులి దాడి చేసిన ఎద్దు మృతదేహం వద్దకు వచ్చి కళేబరాన్ని తింటుండటం కెమెరాలో నిక్షిప్తమైంది. ఒక పులి తన పిల్లలతో వచ్చినట్టు కూడా గుర్తించినట్టు సమాచారం.



పులుల సంతతి పెరిగేందుకు..

ఎన్ఎస్‌టీఆర్‌లో పులుల సంతతి పెరిగేందుకు ఆగస్టు, సెప్టెంబర్ రెండు నెలల పాటు పర్యాటకుల రాకపోకలను నిషేధించారు. ఆ సమయంలో పులులు స్వేచ్ఛగా తిరిగేందుకు అవకాశం కలుగుతుంది. మగ పులి, ఆడపులి కలిసేందుకు అది అనుకూలమైన సమయంగా అధికారులు గుర్తించారు. పులులకు సూపర్ సెన్స్ ఉంటుంది. ఆడపులి రాకను మగపులి 30 కిలో మీటర్ల దూరం నుంచే గుర్తిస్తుంది. ఆడపులి ఒక చెట్టును బరకడం, మూత్ర విసర్జన చేస్తుంది. ఆ సమయంలో విడుదలైన రసాయనాల వాసనను మగపులి గుర్తిస్తుంది. ఆడ పులితో మేటింగ్ తర్వాత వారం రోజులు ఉండి మగ పులి అక్కడి నుంచి వెళ్లిపోతుంది. గర్భం దాల్చిన ఆడపులి 103 రోజుల తర్వాత పిల్లలకు జన్మనిస్తుంది. వాటిని ఇతర వన్యమృగాల బారిన పడకుండా అత్యంత రహస్య ప్రదేశంలో ఉంచి ఆహారానికి వెళుతుంది. అవి కళ్లు తెరిచే వరకు అత్యంత జాగ్రత్తగా ఉంటాయి. ఒక నెల తర్వాత వేటాడడం నేర్పుతోంది. ఇలా 18 నెలల పాటు వాటికి అన్ని రకాల మెళకువలు నేర్పి వదిలేస్తోంది. అలా తల్లి నుంచి వేరైన పులులు సొంతంగా సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుంటాయి. పిల్లలు తనతో ఉన్నంత వరకు మగపులిని మేటింగ్‌కు ఆహ్వానించదు. అవి పిల్లలతో ఆహారం నిమిత్తం పొరపాటున జనారణ్యంలోకి వచ్చిన సమయంలో పులి కూనలను మనుషులు తాకితే ఇక వాటిని తల్లి పులి దగ్గరకు రానివ్వదు. ఇటీవల నంద్యాల జిల్లాలో పిల్లలతో కలిసి జనారణ్యంలోకి పులి వచ్చింది. నాలుగు కూనలు ఆరు బయట ఉండడంతో వాటిని స్థానికులు పట్టుకుని అటవీశాఖ అధికారులకు వివరాలు అందించారు. ఈ సమయంలో వాటిని మనుషులు ముట్టుకోవడంతో వాటి కోసం తల్లి పులి రాలేదని తెలుస్తోంది.

పులుల సంరక్షణకు..

నల్లమల అభయారణ్యంలో నాలుగు డివిజన్లు, 16 నుంచి 20 రేంజ్‌లు ఉన్నాయి. అటవీ సమీపంలో ఉండే చెంచులకు అభయారణ్యంలోని జంతువుల గురించి పూర్తిగా తెలుసు. పెద్ద పులి ఎక్కడ ఉంది.. అది ఏం చేస్తుందనేది దూరం నుంచే పసిగడతారు. మనకంటే వారికే ఎక్కువగా తెలుసు. కొన్ని సందర్భాల్లో అటవీశాఖ సిబ్బందినే గైడ్ చేస్తారు. అందుకే వారిని ప్రొటెక్షన్ వాచర్లుగా, స్ట్రైక్ ఫోర్సులుగా నియమించారు. మొత్తం 600 మందికి ఉద్యోగాలు ఇచ్చి రక్షణగా నియమించారు. వేసవిలో వన్యప్రాణులకు నీటిఎద్దడి లేకుండా అవసరమైన చోట్ల సాసర్‌పిట్‌లు ఏర్పాటు చేసి వాటిని ఎప్పటికప్పుడు నీటితో నింపుతున్నారు.



సాసర్ పిట్ వద్ద నీటి కోసం పులి..



ట్రాక్ కెమెరా ఏర్పాటు చేస్తున్న అటవీ సిబ్బంది



పక్కాగా గణన

పులుల గణన పక్కాగా సేకరిస్తున్నాం. ఎక్కడికక్కడ ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశాం. ఎన్ఎస్‌టీఆర్‌లో పులుల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ప్రొటెక్షన్ వాచర్లను నియమించాం. వేసవిలో వాటికి నీటి అవసరాల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. 120 సాసర్ పిట్లు ఏర్పాటు చేసి వాటి నిర్వహణకు ప్రత్యేక బృందాలను ఉంచాం.


– మహ్మద్ హయత్, ఎఫ్ఆర్ఓ, బయోడైవర్సిటీ కేంద్రం, శ్రీశైలం

పులుల గణన ప్రారంభం

ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా పులుల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్ఎస్‌టీఆర్‌లో ఉండే పులులు శేషాచలం అడవులకు వెళ్లి వస్తున్నాయని అధికారులు గుర్తించారు. వివిధ దశల్లో 80 రోజుల పాటు డేటాను సేకరిస్తారు. ఫిబ్రవరి 20 నుంచి 20 రోజుల పాటు నంద్యాల, పోరుమామిళ్ల, లంకలమల, శేషాచలం కారిడార్‌లో వివరాలు సేకరించారు. మార్చి 11 తర్వాత మిగతా ఏరియాలో కెమెరాలను బిగించి మరో 20 రోజుల పాటు మార్చి 31 వరకు డేటాను సేకరిస్తున్నారు. ఏప్రిల్ 1 నుంచి 20 వరకు ఆత్మకూరు, మార్కాపురం డివిజన్‌లో ఏప్రిల్ 21 నుంచి మే 10 వరకూ డేటాలను సేకరిస్తారు. వీటి ఆధారంగా పులుల సంఖ్యను లెక్కిస్తారు.

దౌర్జన్యాలే టీడీపీ వాళ్ల పని

- దామచర్ల దౌర్జన్యం చేసి మరీ అధికార పార్టీపై నెపం
- పోలీస్ స్టేషన్‌లో ఉన్న వ్యక్తిని బలవంతంగా ఎలా తీసుకెళ్తారు
- టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నన్ను కమ్మపాలెం రానీయకుండా అడ్డుకున్నారు
- దామచర్ల తీరుపై బాలినేని శ్రీనివాసరెడ్డి ఆగ్రహం



విలేకరులతో మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ''వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నా దౌర్జన్యాలు చేయటం మా వల్ల కాదు... దౌర్జన్యాలు చేసేది టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాత్రమేనని'' ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి ధ్వజమెత్తారు. బాలినేని మంగళవారం స్థానిక ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ''ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ రోజు ప్రతి పోలింగ్ బూత్‌లో రెచ్చగొట్టేలా దామచర్ల, ఆయన అనుచరులు ప్రవర్తించి చివరకు అధికార పార్టీకి చెందిన వారు దౌర్జన్యాలు చేస్తున్నారని మా మీద..మా కార్యకర్తల మీద నెపం వేస్తున్నాడు. ఇది మంచి పద్ధతేనా..ఆయన చెప్పటం కొన్ని పత్రికలు ఆయన మాటలను అచ్చు వేయటం..ఆ పత్రికలు కూడా మేము దౌర్జన్యాలు చేసినట్లు రాయటం, ఇదేమి పద్ధతి. ఆరు సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశాను. ఏనాడన్నా ఈ విధమైన పనులు, దౌర్జన్యాలు ఒంగోలు నియోజకవర్గ ప్రజలు చూశారా?, నాపై యక్కల తులసీరావు, శిద్దా రాఘవరావు, పర్వతరెడ్డి ఆనంద్, ఈదర హరిబాబులు ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేశారు. ఒంగోలు పార్లమెంట్‌కు టీడీపీ తరఫున కరణం బలరామకృష్ణమూర్తి పోటీ చేస్తే అదే సమయంలో నేను ఒంగోలు అసెంబ్లీకి పోటీ చేశాను. ఏనాడైనా గొడవలు, దౌర్జన్యాలు జరిగాయా? జనార్దన్ ఒక్కసారి గెలిస్తేనే ఇంత రాద్ధాంతం చేస్తున్నావు, నా మాదిరిగా ఆరుసార్లు పోటీ చేసి ఐదు సార్లు గెలిస్తే ఒంగోలు ప్రజలు నీ దెబ్బకు బతుకుతారా..!. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నన్ను ఒంగోలు నగరంలోని కమ్మపాలేనికి రానీయలేదు, దౌర్జన్యం చేసింది మీరా...మేమా ప్రజలకు తెలియదా.. అన్నీ గమనిస్తున్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలైంది ఏనాడైనా కమ్మపాలెంలో ఏ ఒక్కరినైనా ఇబ్బంది పెట్టానా నువ్వే చెప్పు.. వైఎస్సార్‌సీపీ ప్రతిపక్షంలో ఉండి ప్రజల సమస్యలపై పోరాటాలు చేస్తే మా నాయకులను, కార్యకర్తలను త్రిపురాంతకం, దోర్నాల, కురిచేడు పోలీస్ స్టేషన్లలో పెట్టించిన ఘనత నీది కాదా. మొన్నటి దాకా గుప్తాను అడ్డంపెట్టుకొని మమ్మల్ని తిట్టిచ్చావు. చివరకు పెద్దాయన చిత్తూరు జిల్లాకు చెందిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డితో గుప్తాకు ఏం పని చెప్పండి. పెద్దాయనను ఒరే అని తిట్టిస్తావా, గుప్తాకు డబ్బులిచ్చి తిట్టిస్తున్న సంగతి నాకు తెలిదనుకుంటున్నావా జనార్దన్. ఇప్పుడు నువ్వు పక్కన కూర్చొని ఈశ్వర్ అనే కుర్రాడిని రెచ్చగొట్టి నన్ను తిట్టిస్తావా.. కనీసం 200 మంది ఉన్నారా ఆ పిల్లాడికి, నీకు. మా కాడ లేరా. తిట్టించదలచుకుంటే రోజుకు 10 మందిని పెట్టి తిట్టిస్తా గుర్తు పెట్టుకో. అసలు సిగ్గుందా నీకు..చిన్నా, పెద్దా లేదా... నీకు సంస్కారం లేకపోతే మాకు ఉంది కాబట్టే అధికారంలో ఉన్నా సంయమనం పాటిస్తున్నా, గుర్తు పెట్టుకో. పోలీస్ స్టేషన్‌లో ఉన్న వ్యక్తిని బలవంతంగా తీసుకెళతావా, నేనాడైనా ఆ విధంగా దౌర్జన్యం చేశానా? జనార్దన్‌తో పాటు పోలీస్ స్టేషన్‌లోకి వెళ్లిన టీడీపీ నాయకులందరిపై క్రిమినల్ కేసులు పెట్టాలి. ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో ఒంగోలులో పోలీసులు పూర్తిగా వైఫల్యం చెందారు'' అని బాలినేని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లప్రోలు మల్లికార్జున రెడ్డి, షాహుల్, అయినాబత్తిన ఘనశ్యాం, మారం వెంకారెడ్డి, కుప్పం ప్రసాదు, గొర్రెపాటి శ్రీనివాసరావు ఉన్నారు.

దామచర్ల దాదాగిరిపై చర్యలు షురూ

- ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా దౌర్జన్యకాండకు దిగిన టీడీపీ నేతలు
- పోలీస్‌స్టేషన్ దామచర్ల ఓవరాక్షన్‌పై ఆగ్రహం
- ఆయనకు సహకరించిన ఇద్దరు పోలీసులపై చర్యలు
- ఇద్దరు పోలీసులను వీఆర్‌కు పిలిపించి శాఖాపరమైన విచారణకు ఆదేశం
- దామచర్ల సహా పలువురు టీడీపీ నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ చేసిన ఓవరాక్షన్‌పై జిల్లా పోలీస్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఒంగోలు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో దౌర్జన్యంగా పోలీసులను బెదిరించి టీడీపీ కార్యకర్తను బయటకు తీసుకెళ్లాడు. దీంతో ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి..ఒంగోలు పోలీస్ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పాత మార్కెట్ వద్ద ఉన్న పోలింగ్ కేంద్రంలో టీడీపీ నేతల దౌర్జన్యాన్ని, ఆ తర్వాత ఒంగోలు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో దామచర్ల జనార్దన్ చేసిన ఓవరాక్షన్‌ను ఎస్పీ మలికాగర్గ్ సీరియస్‌గా పరిగణించారు. టీడీపీ నాయకులపై, వారికి సహకరించిన పోలీసులపై చర్యలకు ఉపక్రమించారు. మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో పాటు మరో ఆరుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. దామచర్ల జనార్దన్‌తో పాటు రాచగర్ల వెంకట్రావు, బండారు మదన్, ఎద్దు శశికాంత్ భూషణ్, ఖలీల్ బాష, కొఠారి నాగేశ్వరరావు, క్యాట్ రాముపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. కేసు నమోదైన వారిలో రౌడీ షీటర్లు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా టీడీపీ నాయకులపై 448, 353 రెడ్ విత్ 34 ఐపీసీ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశారు. అక్రమంగా పోలీస్ స్టేషన్‌లోకి ప్రవేశించటంతో పాటు పోలీసులు వారిస్తున్నా బలవంతంగా స్టేషన్‌లో ఉన్న వ్యక్తిని తీసుకెళ్లినందుకు గాను ఈ కేసు నమోదు చేశారు.

పోలింగ్ రోజు టీడీపీ నేతల దౌర్జన్యం

శాసనమండలి ఎన్నికల సందర్భంగా సోమవారం నిర్వహించిన పోలింగ్ రోజు దామచర్ల ఆధ్వర్యంలో నానా రచ్చ చేశారు. ఒంగోలు నగరంలోని పోలింగ్ స్టేషన్లలో అధికార వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టే ధోరణిని అవలంబించటంతో పాటు రెండు, మూడు ప్రాంతాల్లో కవ్వింపు చర్యలకు దామచర్ల దిగాడు. దాంతో అతని అనుచరులను రెచ్చగొట్టి పోలింగ్‌స్టేషన్ల వద్ద తొడగొట్టడం ..మీసాలు మెలేయడం లాంటి ఉసిగొల్పే చర్యలకు ఒడిగట్టారు. చివరకు సెయింట్‌థెరిస్సా స్కూల్ పోలింగ్ బూతు వద్ద దౌర్జన్యానికి దిగిన కాకర్ల ఈశ్వర్ అనే టీడీపీ కార్యకర్తను ఒంగోలు టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే అదే రోజు మధ్యాహ్న సమయంలో ఒక పక్క పోలింగ్ జరుగుతున్నా టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన దామచర్ల.. స్టేషన్‌లో ఉన్న కాకర్ల ఈశ్వర్‌ను బలవంతంగా బయటకు తీసుకెళ్లాడు. దీంతో జిల్లా పోలీస్ యంత్రాంగం సీరియస్ అయింది. టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ టి.శింగయ్య, కానిస్టేబుల్ మల్లేశ్వరరావులను ఎస్పీ మలికాగర్గ్ వీఆర్‌కు పంపారు. పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు తీసుకెళ్లేందుకు వీరు సహకరించినట్లు పోలీసులు నిర్ధారించారు. వీరిద్దరిపై విచారణ చేపట్టాలని ఒంగోలు డీఎస్పీ యూ.నాగరాజును ఆదేశించారు. విచారణ నివేదికను ఆధారం చేసుకొని వీరిపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

నూతన భవనంలోకి జిల్లా ట్రెజరీ కార్యాలయం

- సమీకృత ఆర్థిక భవన సముదాయంగా నామకరణం
- మరో మూడు విభాగాలకు చెందిన కార్యాలయాలు కూడా ఆ భవనంలోకి



నూతనంగా నిర్మించిన సమీకృత ఆర్థిక భవన సముదాయం

ఒంగోలు సబర్బన్: ప్రకాశం భవన్‌లో ఉన్న జిల్లా ట్రెజరీ కార్యాలయాన్ని దక్షిణ బైపాస్‌లో నిర్మించిన నూతన భవనంలోకి మార్చారు. ఈ నెల 9వ తేదీన జిల్లా ట్రెజరీ కార్యాలయాన్ని ఆ భవనంలోని మొదటి అంతస్తులోకి మార్చారు. అయితే పూర్తి స్థాయిలో విధులు మాత్రం మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. మధ్యలో రెండో శనివారం, ఆదివారం, సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికలు కావటంతో వరుస సెలవులు వచ్చాయి. దీంతో ప్రకాశం భవన్‌లో ఉన్న కార్యాలయాన్ని పూర్తి స్థాయిలో నూతన భవనంలోకి మార్చు చేసుకోవటానికి వీలుకలిగింది. దక్షిణ బైపాస్‌లో నిర్మించిన ఈ నూతన భవనానికి సమీకృత ఆర్థిక భవన సముదాయం (ఇన్‌టిగ్రేటెడ్ ఫైనాన్షియల్ కాంప్లెక్స్)గా నామకరణం చేశారు. ప్రభుత్వానికి చెందిన అన్ని ఆర్థిక పరమైన ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఈ భవనంలోకి మార్చాల్సి ఉన్నందున ఈ భవనానికి ఈ నామకరణం చేశారు. ఇప్పటికే జిల్లా ట్రెజరీ కార్యాలయం నూతన భవనంలోకి ప్రవేశించటంతో మరో మూడు ప్రభుత్వ విభాగాలకు చెందిన కార్యాలయాలు కూడా అందులోకి మారాల్సి ఉంది. పే అండ్ అకౌంట్స్ కార్యాలయం, ఏపీజీఎల్ఐ కార్యాలయం, స్టేట్ ఆడిట్ (లోకల్ ఫండ్) కార్యాలయాలు కూడా మారాల్సిన వాటిలో ఉన్నాయి. దక్షిణ బైపాస్‌లోని ప్రగతి భవన్‌కు పాత ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కాంప్లెక్స్ (ఆంధ్ర కేసరి యూనివర్సిటీ భవనం)కు మధ్యలో పాత జాతీయ రహదారి మీదనే ఈ భవనం ఉంటుంది. ఇక నుంచి ప్రకాశం భవన్‌లోని పాత ట్రెజరీ కార్యాలయంలో ఎలాంటి లావాదేవీలు జరపరని జిల్లా ట్రెజరీ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ అన్నపంతుల జగన్నాథ రావు పేర్కొన్నారు.



సెల్ఫీ టైం..

యర్రగొండపాలెం: అసెంబ్లీ సమావేశాల సందర్భంగా తాడేపల్లి చేరిన ఎమ్మెల్యేలు సరదాగా కాసేపు ముచ్చటించుకొని సెల్ఫీ దిగారు. మంగళవారం తాడేపల్లిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలకు అన్ని శాఖలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కాపురం, దర్శి, కనిగిరి ఎమ్మెల్యేలు కందుల నాగార్జునరెడ్డి, మద్దిశెట్టి వేణుగోపాల్, బుర్రా మధుసూదన్ యాదవ్, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను కలిశారు. కాసేపు ముచ్చటించుకున్నవారు మంత్రితో సెల్ఫీ దిగారు.

అనుమానంతో భార్యను చంపిన భర్త


సునీత(ఫైల్)


రక్తపు మడుగులో మృతదేహం

మార్కాపురం: అనుమానంతో ఓ వ్యక్తి తన భార్యను రోకలిబండతో కొట్టి చంపాడు. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి మార్కాపురం మండలంలోని వేములకోట గ్రామంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై సుమన్ కథనం మేరకు.. వేములకోట గ్రామానికి చెందిన సునీత(30)ను 15 ఏళ్ల క్రితం వైపాలెం మండలం ఎల్లారెడ్డిపల్లెకు చెందిన వేళ్ల వెంకటేశ్వర్లుకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమార్తెలు జానకి రమణ, శివాత్మిక ఉన్నారు. గత కొంత కాలంగా సునీతను ఆమె భర్త అనుమానంతో వేధిస్తుండటంతో ఆమె పుట్టింటికి వచ్చింది. అయితే మూడు రోజుల క్రితం సునీత వద్దకు చేరుకున్న వెంకటేశ్వర్లు.. సోమవారం అర్ధరాత్రి రోకలిబండతో కొట్టాడు. ఆమె పెద్దపెట్టున కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం తెలియజేశారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై తెలిపారు.

108 అంబులెన్స్ దగ్ధంపై కేసు నమోదు

పామూరు: మండలంలోని రాజాసాహెబ్‌పేట గ్రామ శివారులో సోమవారం మధ్యాహ్నం సీఎస్‌పురం మండలానికి చెందిన 108 వాహనం దగ్ధమైన విషయం తెలిసిందే. 108 జిల్లా మేనేజర్ విజయ్‌కుమార్, 104, 108 జోనల్ మేనేజర్ శివరాకేష్, జిల్లా ఫ్లీట్ మేనేజర్ మధుసూదన్ సోమవారం రాత్రి, మంగళవారం స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అంబులెన్స్ దగ్ధం కావడానికి షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండవచ్చని భావిస్తున్నామన్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.సురేష్‌యాదవ్ తెలిపారు.

తేలిన పోలింగ్ లెక్క!

- అబ్జర్వర్స్, అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూములకు సీల్
- ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల నుంచి కౌంటింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు
- రేపు ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్
- పట్టభద్రుల స్థానానికి 70.66 శాతం, ఉపాధ్యాయుల స్థానానికి 89.34 శాతం ఓట్లు పోలైనట్లు కలెక్టర్ హరినారాయణన్ వెల్లడి


స్ట్రాంగ్ రూంకు సీల్ వేస్తున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరి నారాయణన్

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ బాక్సుల స్క్రూటినీ ప్రక్రియను మంగళవారం నిర్వహించారు. చిత్తూరు జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఎస్వీ సెట్(ఆర్‌వీఎస్) కళాశాల కౌంటింగ్ కేంద్రంలో స్క్రూటినీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించారు. ప్రకాశం, బాపట్ల, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి ఉపాధ్యాయ, పట్టభద్రుల పోలింగ్ బాక్సులను పకడ్బందీ బందోబస్తు నడుమ కౌంటింగ్ కేంద్రంకు తరలించారు. స్క్రూటినీ ప్రక్రియ అనంతరం ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల స్థానానికి 70.66 శాతం, ఉపాధ్యాయుల స్థానానికి 89.34 శాతం ఓట్లు (తిరుపతి జిల్లాలో రద్దైన 229,233 పోలింగ్ కేంద్రాల ఓట్లు మినహాయించి) పోలైనట్లు అధికారికంగా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు, అబ్జర్వర్‌లు కాటమనేని భాస్కర్, కోన శశిధర్ సమక్షంలో బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూంలలో భద్రపరచి సీల్ చేశామని తెలిపారు. బ్యాలెట్ బాక్సుల భద్రత ప్రక్రియ ను జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ వై.మేఘ స్వరూప్, డి ఆర్ ఓ ఎన్.రాజ శేఖర్... వీరితోపాటు జడ్పీ సీఈ ఓ ప్రభాకర్ రెడ్డి,డ్వామా పీడీ గంగా భవాని, డీపీఓ లక్ష్మీ, ఆర్డీఓలు సుజన, శివయ్య, రేణుకా,మురళి, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు శ్రీలేఖ, కిరణ్మయి, వివిధ మండలాల తహసీల్దార్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రుల పోలింగ్ నెల్లూరు జిల్లాలో అధికం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో నెల్లూరు జిల్లాలో పట్టభద్రుల స్థానానికి అధికంగా ఓట్లు నమోదయ్యాయి. ఆ జిల్లాలో 82,225 మంది ఓటర్లు ఉన్నారు. 68,559 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో ఆ జిల్లాలో అత్యధికంగా 83.38 ఓటింగ్ శాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. అత్యల్పంగా ప్రకాశం జిల్లాలో ఓట్లు నమోదయ్యాయి. ఆ జిల్లాలో మొత్తం 1,07,635 మంది ఓటర్లు ఉండగా, 59,835 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ జిల్లాలో 55.59 శాతం ఓటింగ్ మాత్రం నమోదైంది.

టీచర్ల పోలింగ్ బాపట్ల జిల్లాలో టాప్

టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి అధికంగా బాపట్ల జిల్లాలో ఓట్లు నమోదయ్యాయి. ఆ జిల్లాలో 1789 మంది ఓటర్లు ఉండగా, 1686 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో ఆ జిల్లాలో అత్యధికంగా 94.24 శాతం ఓటింగ్ నమోదైంది. అత్యల్పంగా తిరుపతి జిల్లాలో 86.11 శాతం ఓటింగ్ నమోదైంది. ఆ జిల్లాలో 6132 మంది ఓటర్లు ఉండగా, 5280 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అత్యధికంగా ఓటేసింది పురుషులే..

తూర్పు రాయలసీమ పరిధిలోని ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రుల, టీచర్ స్థానాలకు నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పురుషులు అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రుల స్థానానికి నిర్వహించిన ఎన్నికల్లో పురుషులు 2,45,093 మందికి, మహిళలకు 1,34,686 మందికి ఓటు హక్కు ఉంది. ఇందులో పురుషులు 1,76,871, మహిళలు 91,514 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే విధంగా టీచర్ ఎన్నికల స్థానానికి పురుషులు 16,825 మంది, మహిళలు 10,869 మందికి ఓటు హక్కు ఉంది. ఇందులో పురుషులు 15,107 మంది, మహిళలు 9,634 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.


కౌంటింగ్ కేంద్రానికి తరలిచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ బాక్సులు


బ్యాలెట్‌బాక్సులు భద్రపరచిన రూములకు చెక్కలతో మూసివేసిన దృశ్యం

ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ తుది వివరాలు

జిల్లా	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
అన్నమయ్య	23838	16850	70.69
బాపట్ల	26390	19655	74.48
చిత్తూరు	54152	43161	79.70
నెల్లూరు	82225	68559	83.38
ప్రకాశం	107635	59835	55.59
తిరుపతి	85570	60327	70.50
మొత్తం	379810	268387	70.66

ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ తుది పోలింగ్ వివరాలు

జిల్లా	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
అన్నమయ్య	1932	1728	89.44
బాపట్ల	1789	1686	94.24
చిత్తూరు	3887	3448	88.71
నెల్లూరు	8165	7277	89.12
ప్రకాశం	5789	5322	91.93
తిరుపతి	6132	5280	86.11
మొత్తం	27694	24741	89.34

వెంటాడిన మృత్యువు!

- పాలకూరు వద్ద లారీని ఢీకొట్టి బోల్తా పడిన కారు
- పామూరు మండలానికి చెందిన మహిళ మృతి.. ఆమె కుమార్తె పరిస్థితి విషమం
- స్వల్ప గాయాలతో బయటపడిన మామాఅల్లుళ్లు
- గుంటూరు నుంచి బెంగళూరు వెళ్తుండగా ప్రమాదం


హరీష్, కీర్తి దంపతులు



మృతి చెందిన రామసుబ్బమ్మ


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు


గాయపడిన వెంకటేశ్వర్‌రెడ్డి

పూతలపట్టు:

గుంటూరులో బంధువులను పరామర్శించి తిరిగి వస్తున్న ఓ కుటుంబాన్ని మృత్యువు వెంటాడింది. వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి లారీని ఢీకొట్టి బోల్తాపడటంతో ఓ మహిళ మృతి చెందగా, మరో మహిళ పరిస్థితి విషమంగా ఉంది. ఇంకో ఇద్దరు తేలికపాటి గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన మంగళవారం ఉదయం పూతలపట్టు మండలం పాలకూరు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పామూరు మండలం, తాతయ్యపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్ రెడ్డి(50), భార్య రామ సుబ్బమ్మ(43) కర్ణాటకలోని హల్సూర్‌లో స్థిరపడ్డారు. కుమార్తె కీర్తిరెడ్డి(25), కుమారుడు వంశీ(23)తో కలిసి బెంగళూరులో పీజీ సెంటర్ నిర్వహిస్తున్నారు. గతేడాది కుమార్తెకు సీఎస్‌పురం మండలం జంగవారిపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ హరీష్‌తో వివాహం చేశారు. ఇతను కూడా బెంగళూరులోనే ఉంటూ వర్క్ ఫ్రమ్ హోమ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. గుంటూరులో ఉంటున్న సుబ్బమ్మ ఆడపడుచు భర్తకు గుండెపోటు రావడంతో భర్త, కుమార్తెతో కలిసి అల్లుడి కారులో గుంటూరు వెళ్లారు. సోమవారం రాత్రి 9 గంటలకు బెంగళూరుకు తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో మంగళవారం తెల్లవారుజామున పూతలపట్టు మండలం పాలకూరు వద్ద ముందు వెళ్తున్న తమిళనాడుకు చెందిన లారీని వీరి కారు అదుపుతప్పి ఢీకొట్టింది. కారు బోల్తా పడి నుజ్జునుజ్జయింది. రామసుబ్బమ్మ అక్కడికక్కడే మృతి చెందగా హరీష్, వెంకటేశ్వర్‌రెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తీవ్రంగా గాయపడిన కీర్తిరెడ్డి(25)ని 108 అంబులెన్సులో చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వేలూరులోని సీఎంసీకి తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిప్రసాద్ పేర్కొన్నారు.

ఇంతియాజ్ వైద్యానికి రూ.15 లక్షలు ఆర్థిక సాయం


ఇంతియాజ్ తల్లిదండ్రులకు చెక్కు అందజేస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

పీసీపల్లి: పశువుకు వైద్యం చేస్తుండగా గాయాలపాలై చికిత్స పొందుతున్న ఇంతియాజ్‌కు ఏపీలోని పశువైద్యశాఖ ఉద్యోగులు భారీగా విరాళం అందజేసి ఆదుకున్నారు. మంగళవారం విజయవాడలో పశుసంవర్ధక శాఖా మంత్రి సీదిరి అప్పలరాజు చేతులమీదుగా రూ.15 లక్షల చెక్కును ఇంతియాజ్ తల్లిదండ్రులు మీరావలి, పాచ్చాబీకి అందజేశారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ తల్లిదండ్రులు మాట్లాడుతూ.. తమ కుమారుడి వైద్యానికి చేయూతనందించిన దాతలు, ఉద్యోగులు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకే డీవార్మింగ్

- డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి


విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న డీఎంహెచ్‌ఓ

ఒంగోలు అర్బన్: పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎదిగేందుకు డీవార్మింగ్ మాత్రలు దోహదపడతాయని డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఒంగోలులోని సెయింట్ థెరిసా పాఠశాలలో విద్యార్థులతో ఆల్బెండజోల్ డీవార్మింగ్ మాత్రలు మింగించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఆరు నెలలకు ఒకసారి డీవార్మింగ్ మాత్రలు మింగితే చిన్నారులు ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. డాక్టర్ భగీరధీ, ఆర్‌బీఎస్‌కే నోడల్ అధికారి వాణిశ్రీ, పద్మజ, జాలిరెడ్డి, రమేష్, ధనలక్ష్మి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు

- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- పరీక్ష సమయంలో జెరాక్స్ సెంటర్ల మూసివేత
- మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవు
- ఎస్పీ మలికాగర్గ్ హెచ్చరిక


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు: ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానుండటంతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఇంటర్ పరీక్షలకు సంబంధించి అధికారులతో సమీక్షించారు. అనంతరం ఎస్పీ సంబంధిత వివరాలను మీడియాకు విడుదల చేశారు. ఇంటర్మీడియెట్ పరీక్షలు ఈనెల 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతున్న దృష్ట్యా ఆ సమయంలో పరీక్ష కేంద్రాల సమీపంలోని అన్ని జెరాక్స్ సెంటర్లు మూసివేయాలన్నారు. పరీక్ష హాలులోకి ఐపాడ్, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరన్నారు. విద్యార్థులు ఎవరైనా మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్ష పత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్‌రూముల వద్ద ఆర్మ్‌డ్ రిజర్వు గార్డులను ఏర్పాటు చేశామని, పరీక్ష పత్రాలు కేంద్రాలకు తీసుకువెళ్లేటప్పుడు, మళ్లీ జవాబు పత్రాలను తీసుకువెళ్లేటప్పుడు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున పరీక్ష కేంద్రాల ఆవరణలో బయట వ్యక్తులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యాప్తంగా 72 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయని, పోలీసు స్టేషన్ల పరిధిలో ఉన్న కేంద్రాల్లో అవసరమైన వరకు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించామన్నారు. ఎలాంటి అవకతవకలు, మాల్ ప్రాక్టీసుకు అవకాశం లేకుండా పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని పోలీసు అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పటిష్టంగా ఏర్పాట్లు చేశామని, ప్రత్యేక మొబైల్ పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష సమయంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉండేందుకు అన్ని ముందస్తు చర్యలు చేపట్టామని, విద్యార్థులు 9 గంటల్లోపే పరీక్ష కేంద్రంలోనికి చేరుకోవాలన్నారు. 9 గంటల తరువాత పరీక్ష కేంద్రంలోనికి అనుమతి ఉండదన్నారు. విద్యార్థులతోపాటు పరీక్ష కేంద్రంలో విధులు నిర్వహించే అన్ని శాఖల సిబ్బంది కూడా ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్, స్మార్ట్ వాచీలు, మొబైల్ ఫోన్లు, ఐపాడ్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకువెళ్లేందుకు వీలులేదన్నారు. చిట్టీలు, పుస్తకాలు పెట్టి మాస్‌కాపీయింగ్‌కు, మాల్ ప్రాక్టీస్‌కు విద్యార్థులు ఎవరైనా పాల్పడితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా ఏ పరీక్ష కేంద్రం వద్ద అయినా ఎటువంటి చిన్న ఘటన జరిగినా వెంటనే డయల్ 100 లేదా డయల్ 112కు తెలియజేయాలని లేదా పోలీసు వాట్సప్ నంబర్ 9121102266కు సమాచారం అందించాలని ఎస్పీ మలికాగర్గ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పోలీస్ సిబ్బంది కుటుంబాలకు చేయూత


చెక్కులు అందిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు: మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు ఎస్పీ మలికాగర్గ్ అండగా నిలిచారు. మంగళవారం ఎస్పీ చాంబర్‌లో బాధిత కుటుంబాలకు నగదు చెక్కులు అందజేశారు. ఆర్మ్‌డ్ రిజర్వు విభాగంలో విధులు నిర్వహిస్తూ 2022 సెప్టెంబర్ 14న కె.నాగేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందగా ఆయన సతీమణి కె.అచ్చమ్మకు ఇన్సిడెంటల్ చార్జెస్ కింద రూ.25 వేల చెక్కు అందించారు. ఒంగోలు సబ్‌డివిజన్‌లో విధులు నిర్వహిస్తూ 2022 నవంబరు 5న హోంగార్డు డి.వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందారు. హోంగార్డుల తమ ఒక రోజు వేతనం రూ.4,92,740, జిల్లా సంక్షేమ నిధి నుంచి రూ.10 వేలు, ఫ్లాగ్ ఫండ్ కింద రూ.10 వేల చెక్కును హోంగార్డు సతీమణి రమణమ్మకు ఎస్పీ అందజేశారు. వారి కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే తనను నేరుగా సంప్రదించాలని, పోలీసు శాఖ అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.

ట్రక్ ఢీకొని యువకుడు దుర్మరణం



సంఘటనా స్థలంలో అనిల్‌కుమార్ మృతదేహం

మార్కాపురం టౌన్: మిర్చి లోడుతో వెళ్తున్న ట్రక్కు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని తిప్పాయపాలెం గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై సుమన్ కథనం ప్రకారం.. అర్ధవీడుకు చెందిన అనిల్‌కుమార్(21) వ్యక్తిగత పని మీద బైక్‌పై మార్కాపురం వచ్చాడు. తిరుగుప్రయాణంలో ఉండగా తిప్పయ్యపాలెం గ్రామ శివారులో బేస్తవారిపేట నుంచి మార్కాపురం వైపు మిర్చి లోడుతో వస్తున్న ట్రక్ ఢీకొట్టింది. దీంతో అనీల్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై తెలిపారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

- రూ.7 లక్షలు ఆస్తి నష్టం

హనుమంతునిపాడు: మండల పరిధిలోని ముప్పళ్లపాడు ఎస్సీ కాలనీలో కోటపాటి శేషయ్యకు చెందిన పొగాకు బ్యారన్ ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు చోటుచేసుకుంది. బాధిత రైతు కథనం మేరకు.. బ్యారన్‌లో 1300 పొగాకు కర్రలు క్యూరింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో అల్లిక కర్ర మొద్దు గొట్టంపై జారి పడటంతో మంటలు చెలరేగాయి. స్థానికులు కనిగిరి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో హుటాహుటిన వచ్చి పక్క బ్యారన్‌కు మంటలు వ్యాపించకుండా అదుపుచేశారు. ఈ ప్రమాదంలో రూ.7 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.


దగ్ధమవుతున్న పొగాకు బ్యారన్